## శ్రీ సిరికొండ మధుసూదనా చారి శాసనసభ సభాపతిగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగము

★★★

కళ్ళు చెమర్చుతున్నటువంటి సందర్భం ఇది. ఇంత గొప్ప అవకాశాన్ని నాకు ప్రసాదించిన ఈ సభకి శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. (సభలో కరతాళ ధ్వనులు) సభా నాయకులు గౌరవ ముఖ్యమంత్రి సత్‌సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, శాసనసభా స్పీకర్‌గా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకోడానికి ప్రతిపాదించినందుకు, అందుకు సహకరించిన అన్ని పార్టీల శాసనసభా పక్ష నాయకులకు, తెలంగాణా రాష్ట్రంలో తొలి శాసనసభ్యులుగా ఎన్నుకోబడిన సహచర శాసనసభ సభ్యులందరికీ నా హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

ఒక మహత్తరమైన చారిత్రాత్మక ఘట్టం సందర్భంగా ఏర్పడిన తొలి శాసనసభకి తొలి స్పీకర్‌గా బాధ్యతలు, కర్తవ్యాన్ని నిర్వహించే నమ్మకం నామీద కట్టబెట్టిన ప్రతి ఒక్కరికి మరొకసారి హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి గారికి, అన్ని రాజకీయ పార్టీల శాసనసభా పక్ష నాయకులకు, గౌరవ సభ్యులందరికీ ఒక విషయాన్ని మనవి చేయదలుచుకున్నాను. తెలంగాణ రాష్ట్రం సాధించబడింది. సాధించబడిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో పురోభివృద్ధి దిశలో పయనించవలసిన అవసరం ఉంది. పురోభివృద్ధి దిశలో పయనించడంతోబాటు అభివృద్ధి సాధించడానికి, అభివృద్ధికి సంబంధించినటువంటి కార్యాచరణ రూపొందించడానికి ఈ గౌరవ సభ వేదిక కావాలని మీకందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ఉద్యమ ప్రస్థానంలో తెలంగాణ రాష్ట్రం సాధించబడుతుందని, సాధించబడిన తెలంగాణ రాష్ట్రంలో మా జీవితాలలో వెలుగు ప్రసాదించబడుతుందనే నమ్మకం, ఆ నమ్మకం కలిగినటువంటి దాదాపు నాలుగు కోట్ల ప్రజానీకం దృష్టి ఈ చట్టసభ వైపు ఉంది కాబట్టి దయచేసి గౌరవ సభ్యులందరూ ఆ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించవలసిందిగా కోరుతున్నాను. ఇది ప్రజాస్వామ్య సౌధం. దీని గౌరవం దేశంలో ఇనుమడింపబడాలని గతంలో అత్యున్నత చట్టసభల అధిపతులుగా పని చేసిన మౌలాంకర్ గారు, అనంతశయనం అయ్యంగారు లాంటి ఉద్ధండులు నిర్దేశించినటువంటి, వాళ్లు ఆశించిన విధంగా ఈ సభ కూడా మసలుకోవాలని, అత్యున్నత విలువలకు, ఉన్నత ప్రమాణాలకు ఈ సభ వేదికై రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని మీకందరికీ మనవి చేస్తున్నాను. ఇదే సందర్భంగా మీకందరికీ మరొక విషయం మనవి చేస్తున్నాను. శాసనసభాపతిగా నా విధి నిర్వహణలో రాజకీయాలకు, రాగద్వేషాలకు అతీతంగా, ఈర్ష్యా అసూయలకు తావు లేకుండా మీ అందరితో కలిసి పని చేస్తానని, శాసనసభని నడిపే

క్రమంలో మీ అందరి సహకారం నాకు ఉండాలని కోరుతున్నాను. శాసనసభాపతిగా నేను బాధ్యతలు తీసుకున్న క్రమంలో ప్రసంగించిన పెద్దలందరూ నాకు అభినందనలు తెలుపుతూ నా గురించి కొన్ని విషయాలు చెప్పడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారు, శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు, శ్రీ తలసాని శ్రీనివాస యాదవ్ గారు, శ్రీ ఖాద్రీ గారు, డాక్టర్ కె. లక్ష్మణ్ గారు, శ్రీ తాటి వెంకటేశ్వర్లు గారు, శ్రీ ఎ. ఇంద్రకరణ్ రెడ్డిగారు, శ్రీ సున్నం రాజయ్య గారు, శ్రీ ఆర్. రవీంద్ర కుమార్ గారు, శ్రీ ఈటెల రాజేందర్ గారు, శ్రీ కె. జానారెడ్డిగారు, డాక్టర్ టి. రాజయ్యగారు, శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డిగారు, శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావుగారు, డాక్టర్(శ్రీమతి) జె.గీతారెడ్డి గారు, శ్రీ టి. హరీష్ రావు గారు, శ్రీ మహ్మద్ అలీ గారు, శ్రీ జి. కిషన్ రెడ్డిగారు, శ్రీ జగదీశ్వర్ రెడ్డి గారు, శ్రీ డి.యస్. రెడ్యానాయక్ గారు, డాక్టర్ జి. చిన్నారెడ్డి గారు, శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు, శ్రీమతి కొండా సురేఖ గారు, రసమయి బాలకిషన్ గారు, శ్రీ దాస్యం వినయ్ భాస్కర్ గారు... సహచర శాసనసభ్యులు, పెద్దలందరూ నాతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేయడం జరిగింది. నేను వీళ్లందరికీ మరొకసారి హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి, అదే విధంగా వివిధ పార్టీలుగా, పక్షాలుగా అవతరించి ప్రజల తరపున ఈ గౌరవ శాసనసభలో ప్రాతినిథ్యం వహిస్తున్న వారందరికీ మనవి చేస్తున్నాను, ఈ ఐదు సంవత్సరాల కాలంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని మనవి చేసుకుంటూ, మరొకసారి నాపై మోపబడ్డ బాధ్యతని నేను నిర్వహిస్తానని ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించినటువంటి మీ అందరి విశ్వాసానికి అనుగుణంగా మనలుకొని తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ఈ మొదటి శాసనసభ రాబోయే తరాలకు ఖచ్చితంగా మార్గదర్శకంగా, దశ, దిశ, విలువలను ప్రభోదించే విధంగా నిలబడేలా మనందరమూ సమిష్టిగా ప్రయత్నం చేద్దాం . దానికి మీ అందరి సహకారం ఒక ప్రామాణికంగా నిలబడుతుందనే విషయాన్ని మరొకసారి తెలియజేస్తున్నాను.